
కథ

# "మేడ్ ఫర్ ఈచ్ అదర్!!"



"పదహారేళ్ళ ప్రాయంలో గాడిద కూడా హంసలా వుంటుందట..." చెరుకు రసం బండి దగ్గర పదహారేళ్ళ అమ్మాయిని చూసినప్పుడు హర్షకు టెన్త్‌క్లాస్‌లో తెలుగు మాస్టారు చెప్పిన మాటలు గుర్తొచ్చి నవ్వుకున్నాడు. ఆ అమ్మాయి గ్లాసులు కడగటానికి వంగినప్పుడు నడుం మీద పడే మడత చెమటకు తడిసి మరింత అందంగా మెరుస్తోంది.

"మందిరేంటి ఇంకారాలేదు" నూటపదమూడోసారి అనుకున్నాడు హర్ష వాచీ చూసుకుంటూ. ఆరవుతోంది... అయిదున్నరకే వస్తానంది. అసహనంగా తల విదిల్చి సిగరెట్ తీసి వెలిగించుకున్నాడు. ఈ ఆడవాళ్ళు అన్నింటిలోనూ లేటే. చిరాగ్గా అటుఇటూ చూసాడు. నెక్లెస్ రోడ్డు బిజీగా వుంది. ఆ లాన్లో జంటలు గంపకింద కోడిపెట్టల్లా ఒకరి మీద ఒకరు దాదాపు ఒదిగిపోయి కూర్చుని కబుర్లు చెప్పుకుంటున్నారు. రేపు పెళ్ళయిన తరువాత కూడా వీళ్ళంతా ఇలాగే తన్మయత్వంతో కబుర్లు చెప్పుకుంటారా?!

ఏమో అనుమానమే. ప్రేమ ఊహైతే... పెళ్లి వాస్తవం...!!

ఎక్కడో చదివిన గుర్తు. వాడెవడో బాగా రాశాడు ఆ వాక్యం. ఎంత అనుభవంతో రాశాడో పాపం. మేముకూడా అంతేనా పెళ్లయిన తరువాత ఇలా ఎదురుచూడ్డాలు ఉండవా? అంతా రొటీన్ అయిపోతుందేమో?

నో... నేను మాత్రం మందిరను రొటీన్‌గా ప్రేమించాను. ప్రతి రాత్రి వసంత రాత్రిలా గడుపుతాను...

మందిర...!!

ఎంత చక్కని పేరు. మూన్నెళ్ళ క్రితం పరిచయమైంది. ఈ మూన్నెళ్ళ స్వల్పకాలంలోనే నా మనసులోనే మందిరం కట్టేసి అందులో తిష్ఠవేసింది అనుకున్నాడు.

వేళ్ళమధ్య సిగరెట్ చురుక్కుమనటంతో సిగరెట్‌ను విసిరిపారేశాడు చికాకుతో.

"హాయ్ హలో డియర్ ఎంత సేపయింది వచ్చి?" అప్పుడే అతని దగ్గరకు వచ్చి ఎదురుగా కూర్చుంటూ అంది మందిర.

హర్ష ఆమెను సీరియస్‌గా చూశాడు. ఆ చూపుకు అర్థం తెలుసుకుని.

"ఏంచేయను డియర్. ఇంట్లో వాళ్ళకు ఏవేవో కథలు చెప్పి వచ్చేసరికి ఇదిగో ఇంతలేటయింది. ఫ్రెండ్ ఇంటికి వెళ్ళొస్తానని చెప్పి హడావుడిగా బయలుదేరి వచ్చాను. సారీ ఫర్‌ది లేట్" అంది మందిర నవ్వుతూ.

హర్ష ఆమెను నిశితంగా చూశాడు. గ్రేకలర్ సిల్క్ శారీ మీద ఆకుపచ్చ బ్లౌజ్ పచ్చని ఆమె పసిమిఛాయను ఆ సాయంసంధ్యలో మరింత ద్విగుణీకృతం చేస్తోంది. చక్కగా కట్ చేసిన హెయిర్ భుజాల మీదకు ఫ్రీగా వదిలేసింది. కొనదేరిన ముక్కుపై ముక్కుపుడక నీరెండ కాంతిలో తళుక్కున మెరుస్తోంది. పెదాలకు లైట్ పింక్ కలర్ లిప్‌స్టిక్... ట్రిమ్ చేసిన ఐబ్రోస్... అందంగా... పొడవుగా... నాజూగ్గా ఉన్న చేతివేళ్ళు... గోళ్ళకు పింక్‌కలర్ నెయిల్ పాలిష్... వాష్...

ప్రభాత సంధ్య సోయగాలు.
విభాత సంజె నయగారాలు
ఒకేసారి సాక్షాత్కరిస్తే అది స్వప్నమా?
ఎదురుగా నువ్వుంటే...
అది వాస్తవమే!!

క్రితం రాత్రి చదివిన కవిత గుర్తొచ్చింది హర్షకు మందిరను చూస్తోంటే-

"ఏయ్ ఏంటలా చూస్తున్నావ్?" కొంటెగా నవ్వుతూ అంది.

"నేను నిన్ను చూడటంలేదు..." అన్నాడు హర్ష సీరియస్‌గా.

"మరి?!" అంది ఆమెకూడా సీరియస్‌గా... అటుఇటూ చూస్తూ.

"నీ అందాన్ని తాగుతున్నాను... అది విస్కీకంటే... బ్రాందీకంటే ఎక్కువ కిక్కిస్తోంది..." అన్నాడు నవ్వుతూ.

"ఏంటి నువ్వు సిగరెట్లేకాక విస్కీ... బ్రాందీలు కూడా తాగుతావా?" సీరియస్‌గా అంది మందిర.

"అకేషనల్లీ... నీకిష్టం లేకపోతే మానేస్తాను..." అన్నాడు ఆమెనే ఆరాధనగా చూస్తూ.

"నాకే కాదు ఏ ఆడపిల్లకు ఇష్టం

**శారదా అశోకవర్ధన్**

ఉండదు. తాగుబోతు మగాడ్ని కట్టుకోవడం...' అంది సీరియస్‌గా మందిర.

"నో నేనొప్పుకోను. నువ్వుంటే తల్లిచాటు పిల్లవి. లోకం పోకడా... హాలిడే ఇన్‌లో రెయిన్ డాన్స్‌లు... హైలీ ఇన్‌ప్లేమబుల్ కపుల్స్ విషయం తెలియక పోవొచ్చు..." అన్నాడు హర్ష సిగరెట్ వెలిగించుకుంటూ.

"హైలీ ఇన్‌ప్లేమబుల్ కపుల్స్ ఏంటి? ఆయిల్ ట్యాంకర్స్‌లాగా?!" అంది ఆశ్చర్యంగా మందిర అతన్నే ఆరాధనా చూస్తూ. హర్ష పెద్దగా నవ్వి-

"మొగుడు పెళ్ళాలు ఇద్దరూ కలిసి కూర్చొని పీకలవరకూ తాగుతున్న రోజులివి. అలా ఫుల్లుగా తాగటం వల్ల సిగరెట్ కోసం అగ్గిపుల్ల గీస్తే భగ్గున బర్న్ అయిపోయే ప్రమాదం ఉందన్న మాట" అన్నాడు హర్ష సీరియస్‌గా.

"ఏంకాదు నీవన్నీ దొంగమాటలు..." అంది మందిర బుంగమూతిపెట్టి.

"అబ్బ అలా మూతిముడిస్తే ఎంత అందంగా వున్నావో డియర్. అసలు నీ ప్రతి కదలికా అందమే... అణువణువూ అందమే... నాకోసమే పుట్టి నిలువెల్లా వసంతాలు నింపుకున్న అందాల రాశివి అన్నాడు హర్ష సీరియస్‌గా.

"సర్లే ఇంతకి మన పెళ్లి విషయం చెప్పావా ఇంట్లో?! నాకు చెప్పాలంటే భయంగా వుంది... మన ప్రేమ పెళ్ళిగా మారుతుందా లేదా? అనే భయం వేస్తోంది" అంది మందిర దిగులుగా.

"ఎందుకు డియర్. మనం ఎప్పటికీ ఇలానే ఉండిపోతే నష్టం ఏంటి? ప్రేమకు పరాకాష్ట పెళ్ళా?! నాకు పెళ్లి అనే ఆ రెండక్షరాల మీద నమ్మకంలేదు. మనం రొటీన్‌కు భిన్నంగా ఇలానే ఉండిపోదాం ప్రేమించుకుంటూ" అన్నాడు హర్ష సీరియస్‌గా.

"నాకేం అభ్యంతరంలేదు. నా చేయి తాకినా చెంప చెళ్ళుమనిపిస్తా" అంది నవ్వుతూ.

"అమ్మో అంత శిక్ష విధించకు. కొంగ బావ విందులాగా" అన్నాడు భయం నటిస్తూ.

"అందుకే వెంటనే ముహూర్తాలు పెట్టించమను" అంది దిగులుగా మందిర.

"ఏమో మన విషయం చెప్పాలంటే నాకూ భయంగానే ఉంది మందిర... ఏమంటారో అని" అన్నాడు హర్ష.

"నువ్వింత పిరికివాడివని తెలిస్తే అసలు ప్రేమించేదానిని కాను. నేవెళ్తున్నా ఇప్పటికే ఆలస్యమయింది" అంది మందిర సీరియస్‌గా.

"ఏ...య్... అప్పుడేనా?" అన్నాడు హర్ష... షారూఖ్‌ఖాన్‌లా గొంతు వణికిస్తూ.

"అప్పుడేనా ఏంటి? నేనొచ్చి గంటయింది. వెళ్ళాలి. ఇంటిదగ్గర అమ్మ ఎదురుచూస్తుంటుంది. అరగంటలో వచ్చేస్తానని చెప్పాను" అంది భయంగా మందిర.

"ఛ... ఇలా ప్రతి చిన్న విషయానికి భయపడిపోయే ఆడపిల్లంటే నాకిష్టం వుండదు... మరీ ఇంత కట్టుబాట్లతో పెంచితే ఎలా?" అన్నాడు హర్ష సీరియస్‌గా.

"మరి బలాదూర్ తిరగాలా? నాకిష్టం లేదుబాబు అలా తిరగడం... మా ఇంట్లో చిన్నప్పటి నుంచీ అంతే నాలుగింటికే ఇల్లు చేరుకోవాలి. మా నాన్నొక అమ్రేష్‌పురి... మా అన్నయ్య శక్తికపూర్" అంది మందిర నవ్వుతూ.

"మంచిదే ఆడపిల్లల్ని అంతే పెంచా



2

లనుకో... ఒకవిధంగా నేను అదృష్టవంతుడ్ని మందిరా... నీలాంటి అమాయకురాలు... ఉత్తమురాలు నాకు లభించడం" అన్నాడు హర్ష ఆమెనే అపురూపంగా చూస్తూ.

"మీరు మాత్రం... అందానికి అందం... మంచి హోదా...

ఏ ఆడపిల్లకయినా ఇంతకంటే కావాల్సింది ఏముంది?" అంది హర్షను ఆరాధనగా చూస్తూ.

"వుయ్ ఆర్ మేడ్‌ఫర్ ఈచ్ అదర్. ఈరోజే ధైర్యంచేసి మా ఇంట్లో చెప్పేస్తా నీ విషయం. ముహూర్తం కూడా అతి త్వరలో పెట్టించమంటాను. ఎంతసేపని థియరీ చదువుతాము? నావళ్ళకాదు. ప్రాక్టికల్స్ మొదలెట్టాలి" అన్నాడు హర్ష సీరియస్‌గా.

అతని మాటలు వెంటనే అర్థంకాలేదు మందిరకు. కొన్ని క్షణాల తరువాత అర్థం చేసుకుని యూ నాటి... అంటూ అతని చెవి పట్టుకుంది.

** ** **

అందమైన డబుల్‌కాట్... దానిపైన ఫోంబెడ్... బెడ్‌పైన ముదురు ఎరుపురంగు మక్‌మల్ క్లాత్. కాట్ చుట్టూ మల్లెపూల... విరజాజుల దండలు. గది అంతా మత్తుగా ఆవరించిన అగరొత్తుల సువాసన. ఓమూలగా టీపాయ్‌మీద రకరకాల పండ్లు... స్వీట్లు... కాట్‌కు ఎదురుగా డ్రెస్సింగ్ టేబుల్. హర్షకు పిచ్చెక్కిపోతోంది. ఇక అతను మందిర కోసం క్షణం కూడా వెయిట్ చేసే స్థితిలో లేడు. గదిలో అసహనంగా అటు ఇటు రక్తం రుచి మరిగిన పులిలా తిరుగుతున్నాడు. ఇంతలో తలుపు దగ్గర చప్పుడైంది.

మందిరను బయటనుంచి కొంతమంది ఆడవాళ్ళు నవ్వుకుంటూ లోపలికి తోసి బయట బోల్టు వేశారు.

హర్ష ఆమెనే ఆశ్చర్యంగా... ఆనందంగా చూస్తున్నాడు.

వెన్నెల జలపాతంలో రాలిపడిన కలువ నక్షత్రంలా... తెల్లని దుస్తుల్లో... తలనిండా మల్లెపూలతో... చేతిలో పాలగ్లాసుతో అందంగా సిగ్గుపడుతూ అలానే నిలుచునివుంది.

హర్ష మెల్లగా ఆమెను సమీపించి... తన చూపుడువేలితో ఆమె చుబుకాన్ని పైకెత్తి అన్నాడు.

"నీ వయసు పొంగులకు... ఈ పాలపొంగులు తోడై నన్ను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి డియర్. జీవితంలో నేను ఇంతవరకు ఏ అమ్మాయితోనూ మాట్లాడలేదు... ఏ అమ్మాయిని ప్రేమించలేదు. అందుకే మనది పెద్దలు నిశ్చయించిన పెళ్ళే అయినప్పటికీ థ్రిల్ కోసం అపరిచితుల్లా ప్రేమించుకున్నట్లు నాటకమాడమన్నాను. నువ్వెంటనే ఒప్పుకుని సరే అన్నావు. ప్రేమించి పెళ్ళి చేసుకుంటే ఎలావుంటుందో అనే కోరిక కూడా తీరింది... థాంక్స్" అన్నాడు హర్ష నవ్వుతూ.

నిజానికి అతనికి అంతకుమునుపే ఎంతోమంది అమ్మాయిలతో పరిచయం ఉంది. కానీ తనో శ్రీరామచంద్రుణ్ణి అని భార్య దగ్గర పేరు తెచ్చుకోవటానికి అలా నాటకమాడమన్నాడు.

మందిర నన్ను పూర్తిగా నమ్మింది అని సంబరపడిపోతున్నాడు.

"మీ కోరికే నా కోరిక హర్ష. సారీ... మీ కోరికే నాకోరికండి" అంది తడబడుతూ.

"హర్ష అనే పిలువు మందిరా... పేరు పెట్టి పిలిస్తేనే నాకిష్టం..." అన్నాడు ఆమెను ఆరాధనగా చూస్తూ.

"అమ్మో భర్తను పేరుపెట్టి పిలవటమా?! మా అమ్మ చంపేస్తుంది" అంది అమాయకంగా.

"సెంటిమెంటల్ ఫెలో మరీ అమ్మకూచి..." అన్నాడు మురిపంగా, ఆమె ముక్కుపట్టి లాగుతూ...

మందిర నవ్వింది.

వాస్తవానికి ఆమెకూడా లోగడ ఇద్దరు ముగ్గుర్ని ప్రేమించింది. ప్రేమలు బెడిసికొట్టడంతో... ఇంట్లో వాళ్ళకు ఆవిషయం తెలిసి హడావుడిగా ఈ సంబంధం చేశారు. తాను కూడా హర్షలాగానే అనుకుని తృప్తిగా ఊపిరి పీల్చుకుంది. నన్ను పూర్తిగా అమ్మకూచీ అని నమ్మేశాడు. థాంక్‌గాడ్. ఇదీ ఒకందుకు మంచిదే. హర్ష ప్రేమించుకుంటున్నట్లు నాటకమాడదామని చెప్తే ముందు చాలా సహజంగా అమ్మో అని భయం నటించింది... ఇంతకుమునుపు ఏ మగవాడితోనూ పరిచయంలేదని హర్ష పూర్తిగా నమ్మేశాడు అని తృప్తిగా ఊపిరి పీల్చుకుంది.

వాళ్ళ దొంగాట చూడలేక చంద్రుడు మేఘాల ముసుగును కప్పుకున్నాడు. ఈతరం దంపతుల మాటలు వినలేక ఓ పక్షి వింతగా అరుస్తూ ఎగిరిపోయింది. ●



# బహుకళల సమ్మేళనం మిమిక్రీ

మిమిక్రీ రంగంలో ఎంతోమంది కళాకారులను తయారుచేసి గురువులకు గురువుగా పేరుపడిన డాక్టర్ నేరెళ్ళ వేణుమాధవ్‌కు ఈ రంగంలో గురువంటూ ఎవరూ లేకపోవడం విశేషం. ఆయన మిమిక్రీని తనంతట తానే నేర్చుకున్నారు.

1932లో వరంగల్‌లో జన్మించిన వేణుమాధవ్ ప్రపంచాన్ని మూడు పర్యాయాలు చుట్టివచ్చినా, ఇప్పటికీ వరంగల్‌లోనే నివశిస్తున్నారు. ఇప్పటికే ఎన్నో పురస్కారాలు అందుకున్న డాక్టర్ వేణుమాధవ్‌కు సికిందరాబాద్ వాకర్‌టౌన్ జూనియర్ చాంబర్ వారు ఇటీవల 'మిమిక్ ఆఫ్ ది మిలీనియం' అవార్డును అందచేసిన సందర్భంగా ఆయన ప్రభాతవార్తతో ముచ్చటించారు.

"మీరు ఆంధ్రప్రదేశ్‌లోనే కాదు, యావత్ భారతదేశంలో మొట్టమొదటి మిమిక్రీ కళాకారుడు కదా?" అంటే "మిమిక్రీ కళకు ఆద్యులం మేమెవరం కాదు; అసలు ఆద్యుడు రామాయణంలోని మారీచుడు" అంటారాయన చిరునవ్వుతో.



డాక్టర్ నేరెళ్ళ వేణుమాధవ్

### గురువు లేని గురువర్యుడు!

"ఎంతోమంది శిష్యులను తయారుచేసిన మీకు గురువు ఎవరూ లేకుండా ఎలా నేర్చుకోగలిగారు ?" అని ప్రశ్నిస్తే, వేణుమాధవ్ ఈ విధంగా వివరించారు - "నాకు మిమిక్రీలో గురువంటూ ఎవరూ లేని మాట నిజమే. పనిగట్టుకుని స్ఫూర్తినిచ్చినవారు కూడా ఎవరూ లేరు. అయితే నాకు 15 ఏళ్ళ వయసులో అంటే 1947 లో చిత్తూరి నాగయ్య నటించిన 'భక్త పోతన' సినిమా చూసాను. ఆ చిత్రంలో నాగయ్య "ఎవ్వనిచే జనించు, జగమెవ్వనిలోపలనుండు లీనమై..." అంటూ పాడిన పద్యం ఇమిటేట్ చేయాలనిపించింది. ఆ పద్యాన్ని రెండు మూడు సార్లు విని, అచ్చం నాగయ్య స్వరాన్ని ఇమిటేట్ చేయడంలో సఫలీకృతుడ్ని కాగలిగాను. దాంతో ఆ అభిరుచి అలా అలా పెరిగి ఇతర నటుల్ని, రాజకీయ నాయకుల్ని, ఇతర ప్రముఖుల్ని ఇమిటేట్ చేయగల స్థాయికి పెరిగింది. నేర్చుకున్న విద్యను అక్కడక్కడా ప్రదర్శిస్తూ వుండేవాణ్ణి. బహిరంగ వేదికపై తొలిసారిగా రాజమండ్రిలో 1953 లో గరికపాటి రాజారావు ప్రోత్సాహంతో మొట్టమొదటి ప్రదర్శన ఇచ్చాను"

### ఎక్కువ తృప్తినిచ్చింది 'టెన్‌కమాండ్‌మెంట్స్'

"ఒక గొంతును ఇమిటేట్ చేయాలంటే అనేకసార్లు వినాలి కదా, ఇప్పటిలా టేప్ రికార్డర్ వంటి పరికరాలు అందుబాటులో లేని ఆ రోజుల్లో మీరు ధ్వన్యనుకరణ చేయడం ఎలా సాధ్యపడింది? గత యాభైయేళ్ళుగా మీరుచేసిన ధ్వన్యనుకరణలో మీకు బాగా తృప్తినిచ్చిన అంశం ఏమిటి?" అని అడిగిన ప్రశ్నలకు ఆయన ఈ విధంగా జవాబు ఇచ్చారు - "ఇప్పుడున్న పరికరాలు అప్పట్లో లేని మాట నిజమే. పాటో, ప్రసంగమో మళ్ళీ మళ్ళీ వినే అవకాశం చాలా తక్కువ. గ్రామఫోన్ రికార్డులు, రేడియోలు, సినిమాల్లో రెండు మూడు సార్లు విని, వాటిని కంఠతా పట్టి, మిమిక్రీ ప్రాక్టీస్ చేస్తుండేవాడిని. నేను చేసే ప్రతి కార్యక్రమం నాకు నచ్చిందే; అయితే, 'టెన్ కమాండ్‌మెంట్స్' చిత్రంలోని సన్నివేశాలకు నేను చేసిన ధ్వన్యనుకరణ నాకు ఎక్కువ తృప్తినిచ్చింది. ఎందుకంటే అందులో అన్ని అంశాలు సమగ్రంగా వున్నాయి. మిమిక్రీ కళాకారుడంటే కేవలం ధ్వన్యనుకరణచేసేవాడని మాత్రమే కాదు; మిమిక్రీ కళాకారుడు నటన, హాస్యం, ధ్వన్యనుకరణ, బహుపాత్రాభినయం తెలిసినవాడై వుండాలి. యాక్టరైవుండాలి; జర్నలిస్టైవుండాలి; ప్రహసనాలు చదివినవాడై వుండాలి; నాటకాలు చూసినవాడై వుండాలి. వెంట్రిలాక్విజం, మైమ్ తెలిసినవాడై వుండాలి."

### దేనికుండే గౌరవం దానికివ్వాలి

ప్రస్తుతం టి.వి.చానల్స్ ఎక్కువవుతున్న దృష్ట్యా మిమిక్రీ కళాకారులు డబ్బింగ్ ఆర్టిస్టులుగా ఉపయోగపడే అవకాశాలు మెరుగుపడ్డాయి కదా? అని ప్రశ్నిస్తే, ఆయన జవాబిస్తూ, "మిమిక్రీ కళాకారులు డబ్బింగ్ ఆర్టిస్టులుగా ఉపయోగపడడాన్ని నేను వ్యక్తిగతంగా వ్యతిరేకిస్తాను. డబ్బింగ్ వేరే కళ. మిమిక్రీ వేరే కళ. దేనికుండే గౌరవం దానికి ఇవ్వాలి. 35 సంవత్సరాల క్రితం ఒక నిర్మాత నా దగ్గరకు వచ్చి, భానుమతి పాత్రకు డబ్బింగ్ చెబితే, కోరినంత ప్రతిఫలం ముట్టచెబుతానన్నాడు. నాకు అలా డబ్బింగ్ చెప్పడం ఇష్టముండదని ఆ ఆఫర్ తిరస్కరించాను. మిమిక్రీ కళను ప్రదర్శించడానికి అతి తక్కువ వ్యవధి చాలు; మేకప్ అవసరంలేదు; స్టేజి డెకరేషన్ కూడా అవసరంలేదు. తక్కువ వ్యవధి ఇచ్చినా మిమిక్రీ కళను ప్రదర్శించడంలో తప్పులేదు కానీ, స్టేజిపై కుర్చీలు సర్దుకునే లోపు కర్టెన్ ముందు నిలబడి ప్రదర్శనలివ్వడం, కర్టెన్ తీస్తే దాంతోపాటే చుట్టబెట్టుకుని వెళ్ళిపోవడం వంటివి మిమిక్రీ కళకున్న విలువను దిగజారుస్తాయి" అని ఆయన అన్నారు.

– యామన రంగారావు